క్లుప్తంగా

సెయింట్ ఆన్స్ వైద్యశాల పునఃప్రారంభం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలో సెయింట్ ఆన్స్ వైద్యశాల ఆదివారం పునఃప్రారంభమైంది. విజయవాడ కతోలిక పీఠాధిపతి రెవరెండ్ బిషప్ తెలగతోటి రాజారావు నూతన వైద్యశాల భవనాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సుమారు 90 ఏళ్ల చరిత్ర కలిగిన సెయింట్ ఆన్స్ వైద్యశాల ఎందరికో వైద్య సేవలు అందించిందని చెప్పారు. సిస్టర్లు రోజా పుష్ప, ఎలిజబెత్ ఆంటోనీ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ విధిగా ధరించాలి



తిరువూరు: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ సత్యనారాయణ అన్నారు. స్థానిక అష్టలక్ష్మీ గుడి వద్ద హెల్మెట్ డ్రైవ్ ఆదివారం నిర్వహించారు. హెల్మెట్ ధరించని సుమారు 20 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి హెల్మెట్‌లు కొనిపించారు. బైక్స్ చోరీ జరగకుండా అందరూ జీపీఎస్ ట్రాకర్స్ పెట్టుకోవాలని ఎస్ఐ సూచించారు.

అక్షరాస్యతతోనే అభివృద్ధి



ఆగిరిపల్లి: అక్షరాస్యతతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించవచ్చని డీఆర్‌డీఏ పీడీ విజయ రాజు అన్నారు. మండలంలో ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం ద్వారా అక్షరాస్యత పూర్తిచేసిన 274 మందికి 27 కేంద్రాల్లో ఆదివారం పరీక్షలు నిర్వహించారు. పోతవరప్పాడులోని పరీక్ష కేంద్రాన్ని విజయ రాజు తనిఖీ చేశారు. అనంతరం డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ కొవ్వలి ఆనంద్ కుమార్, వెలుగు ఏపీఎం రాజశేఖర్, డీపీఎం అనిత, సీసీలు దివ్య, హుస్సేన్‌బి తదితరులు పాల్గొన్నారు.

జానకిరామ శర్మకు జ్యోతిష్యరత్న అవార్డు



నూజివీడు: మండల పరిధి పల్లెర్లమూడిలోని కాశీ విశాలాక్షి సమేత విశ్వనాథ స్వామి ఆలయ అర్చకుడు సామవేదం జానకీరామశర్మ జ్యోతిష్యరత్న అవార్డును ఆదివారం అందుకున్నారు. విశ్వజ్యోతి విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఐకాస్ వైజాగ్ సంస్థ చైర్మన్ జొన్నలగడ్డ శ్రీనివాసరావు చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు.

కొనసాగుతున్న అల్పాహార పంపిణీ



భవానీపురం(విజయవాడపశ్చిమ): పదోతరగతి విద్యార్థులకు వాసవి క్లబ్ భవానీపురం సభ్యుల సేవలు కొనసాగుతున్నాయి. విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు వాసవీ క్లబ్ సభ్యులు ఫిబ్రవరి 10వ తేదీ నుంచి ప్రతి రోజూ సాయంత్రం అల్పాహారం, పాలు పంపిణీ చేస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం సాయంత్రం కూడా విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేశారు. పరీక్షలు ముగిసేవరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని క్లబ్ సభ్యులు చెబుతున్నారు. అల్పాహార పంపిణీ కార్యక్రమానికి సమన్వయకర్తగా కోట హరికృష్ణ వ్యవహరిస్తున్నారు. వాసవి క్లబ్ భవానీపురం అధ్యక్షులు వీఎస్‌వీ కిరణ్‌కుమార్, కార్యదర్శి కె.శశికాంత్, కోశాధికారి జూపూడి చంద్రశేఖర్, సభ్యులు పబ్బిశెట్టి వెంకట జయ నారాయణ, చుండూరు శ్రీధర్, ఆలమూరి సాంబశివరావు, దేసు వెంకట శివప్రసాద్‌తోపాటు మిగిలిన సభ్యులు దాతలుగా వ్యవహరిస్తున్నారు. కార్యక్రమాన్ని డీఎస్ఎంసీ హైస్కూల్ హెచ్ఎం మాతంగి కోటయ్య, ఉపాధ్యాయులు కె.శివ పార్వతి, కె.జ్యోతిర్మయి పర్యవేక్షిస్తున్నారు.

8 మంది జూదరుల అరెస్టు

విస్సన్నపేట: మండలంలోని నరసాపురం గ్రామ శివారులో పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేసి 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3,150 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. గ్రామాల్లో జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

కొండలా మొండి బకాయిలు

- ఏటా పెరుగుతున్న బకాయిలు
- ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు రూ.2.70 కోట్లు
- పట్టణ అభివృద్ధిపై తీవ్ర ప్రభావం



నూజివీడు మున్సిపల్ కార్యాలయం

నూజివీడు: నూజివీడు మున్సిపాలిటీలో మొండి బకాయిల చిట్టా ఏటా పెరిగిపోతోంది. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన పన్ను బకాయిలు కోట్లలో పేరుకుపోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి సుమారు రూ.2 కోట్లకు పైగా పన్ను బకాయిలు రావాల్సి ఉంది. సామాన్యులు పన్ను చెల్లించడంలో జాప్యం చేస్తే అధికారులు నానా హడావుడి చేస్తారు. నగదు సర్దుబాటు కాక ఆలస్యంగా చెల్లిస్తే జరిమానాలు విధిస్తారు. అలాంటిది రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, వాటి ఆస్తులకు సంబంధించిన పన్నులు కోట్లలో పేరుకుపోతున్నా అధికారులకు కనీసం చీమ కుట్టినట్లుగా కూడా లేదు.

70కి పైగా ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్తులు..

రెవెన్యూ డివిజన్ కేంద్రమైన నూజివీడు మున్సిపాలిటీలో దాదాపు 70కు పైగా రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, ఆయా శాఖలకు సంబంధించిన ఆస్తులు ఉన్నాయి. వీటిలో 90 శాతానికి పైగా ప్రభుత్వ ఆస్తులకు సంబంధించి పన్నులు ఏళ్ల తరబడి చెల్లించకపోవడంతో బకాయిలు పేరుకుపోయాయి. అసలు తాము మున్సిపాలిటీ పరిధిలో ఉన్నాం.. మున్సిపాలిటీ నుంచి సౌకర్యాలు పొందుతున్నాం.. అందుకు పన్నులు చెల్లించాలన్న విషయమే ఆయా శాఖలు మరిచిపోయాయి. బకాయిలు చెల్లించాలన్న స్పృహ ఆయా శాఖల అధికారుల్లో కనబడటం లేదు.

ప్రధాన ఆదాయ వనరు పన్నులే

మున్సిపాలిటీలకు ప్రధాన ఆదాయ వనరు పన్నులే. వీటి ద్వారా నిధులు సమకూరే జనరల్ ఫండ్ నుంచే మున్సిపాలిటీ సిబ్బందికి జీతాలను చెల్లించడం, కరెంటు బిల్లులు కట్టడం, ఇతర అభివృద్ధి పనులు చేపట్టడం చేస్తారు. కోట్లలో బకాయిలు పేరుకుపోవడంతో పట్టణ అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది.

మరో వారంలో ఆర్థిక సంవత్సరం ముగింపు

నూజివీడు పట్టణంలోని రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి పన్ను బకాయిలు రూ.2.70 కోట్లు ఉంది. ఈ మొత్తం ఏటా పెరుగుతూనే ఉంది. కొండలా పేరుకుపోయిన మొండి బకాయిల్లో అధిక శాతం ప్రభుత్వ కార్యాలయాల నుంచే రావాల్సి ఉంది. మొండి బకాయిలను వసూలు చేసేందుకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఈ పన్నులు ఎప్పటికి పూర్తిస్థాయిలో వసూలు చేస్తారనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలిపోనుంది. ఈ ఆర్థిక సంవత్సరం మరో వారంలో ముగుస్తున్న నేపథ్యంలో మొండి బకాయిల వసూళ్లు అనేది ప్రశ్నార్థకరంగా మారింది.

అభివృద్ధి పనులు చేపట్టేందుకు పన్నుల వసూళ్లే కీలకం

సుమారు 70వేల జనాభా నివసిస్తున్న నూజివీడు పట్టణంలో తాగునీరు, రహదారులు, డ్రెయినేజీలు, విద్యుత్ దీపాల నిర్వహణ, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల కల్పన, ఇతర అత్యవసర సమస్యల పరిష్కారానికి పురపాలక సంఘం ఆర్థికంగా బలోపేతంగా ఉండాలి. మున్సిపాలిటీకి ఆదాయం వచ్చే వనరులు ఏమీ లేకపోవడంతో పన్నుల ద్వారా వచ్చే ఆదాయమే కీలకం. ప్రభుత్వం నుంచి అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరైనా అన్ని అవసరాలు తీరాలంటే పురపాలక సంఘం సొంత ఆదాయంపై ఆధార పడాల్సి ఉంటుంది. ఇందుకు రెవెన్యూ విభాగం పన్నులను సకాలంలో వసూలు చేయడం, మొండి బకాయిలను రాబట్టడం వంటిపై దృష్టి సారించాల్సి ఉంటుంది.

పన్ను బకాయిలున్న ప్రభుత్వ కార్యాలయాల్లో కొన్నింటి వివరాలు ఇలా..

ప్రభుత్వ కార్యాలయం	బకాయి మొత్తం రూ.లలో
తహసీల్దార్ కార్యాలయం	18,21,014
పోలీస్‌శాఖ	17,20,949
పీఆర్ ఈఈ కార్యాలయం	16,68,696
సబ్ కలెక్టర్ కార్యాలయం	13,78,018
రైతు బజార్	8,90,993
ఎస్సీ బాలికల హాస్టల్	8,80,105
ఏపీ స్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్	8,75,821
జెడ్పీ శాఖ	8,41,958
కొండయ్య సత్రం	8,28,252
ఎంపీడీఓ కార్యాలయం	7,73,784
ఆర్అండ్‌బీ డీఈ కార్యాలయం	7,63,634
రాణి గారి సత్రం	5,00,699
ట్రెజరీ కార్యాలయం	1,45,180
రెవెన్యూ రిక్రియేషన్ క్లబ్	1,91,873

బకాయిల వసూలుకు నోటీసులు జారీ చేస్తున్నాం



ప్రభుత్వ కార్యాలయాల బకాయిల వసూలుకు ప్రతి నెలా నోటీసులు జారీ చేస్తున్నాం. పట్టణంలో 70కి పైగా ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన ఆస్తులు ఉన్నాయి. బడ్జెట్ మంజూరు కొరకు పంపామని, మంజూరు చేయగానే పన్నులు చెల్లిస్తామని అధికారులు చెబుతున్నారు.

– ఏపీఎల్ నరసింహారావు, రెవెన్యూ అధికారి, నూజివీడు మున్సిపాలిటీ

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 24న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం)ను నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించి గడువు లోగా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

నేడు మామిడి రైతులకు కిసాన్ మేళా

నూజివీడు: పట్టణంలోని మామిడి పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో ఈనెల 24న మామిడి రైతులకు కిసాన్ మేళా, వర్క్‌షాపు నిర్వహిస్తామని పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త బొర్రా కనకమహాలక్ష్మి ఆదివారం తెలిపారు. ఈ మేళాలో మామిడి ఎగుమతులు పెంపొందించేందుకు చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులు, మామిడి సాగులో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, మామిడి కోతల తరువాత తోటల్లో చేపట్టాల్సిన చర్యలు, ఎగ్జిబిషన్ నిర్వహణ, రైతులు, వ్యాపారులు, ఎగుమతిదారులతో ముఖాముఖి చర్చా కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. విజయవాడ రోడ్డులోని నాగేంద్రరావు కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సూర్యోపాసన సేవ జరిగింది. లోక కల్యాణార్థం, సర్వ మానవాళికి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ప్రతి ఆదివారం సూర్యోపాసన సేవ నిర్వహిస్తుంటారు. ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్యభగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సూర్యనమస్కారాలు, సూర్యోపాసన సేవ నిర్వహించగా, పలువురు ఉభయదాతలు సేవలో పాల్గొని పూజలు జరిపించుకున్నారు.

సత్య సాయి బాబా పల్లకి సేవ



జక్కంపూడిలో పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

విజయవాడరూరల్: పుట్టపర్తి సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జక్కంపూడి, షాబాదు గ్రామాల్లో స్వామి పల్లకి సేవ, నామస్మరణ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విజయవాడ సీతారాంపురం సత్య సాయి బాబా సేవా సమితి వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. 60 మంది సేవాదళ్ సభ్యులు, యువత గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు. స్వామి వారికి పలువురు భక్తులు ఇంటి వద్ద స్వాగతం పలుకుతూ హారతులు ఇచ్చారు. కార్యక్రమం అనంతరం స్వామి వారికి మంగళ హారతి, ప్రసాద వితరణ జరిగింది. స్వామి వారి దివ్య అనుగ్రహ ఆశీస్సులు అందరి మీద ఉండాలని కోరుకున్నారు. సమితి కన్వీనర్ ఎన్వీఎల్ నరసింహారావు, ఏకే నారాయణ, గ్రామ సేవల ఇంచార్జి టీజేఆర్ గుప్తా, ,గ్రామాల కన్వీనర్లు సత్యనారాయణ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనల్లో నాణ్యత పెరగాలి



మాట్లాడుతున్న ఆచార్య సుధాకరరెడ్డి

పటమట(విజయవాడపశ్చిమ): పరిశోధనల్లో నాణ్యత ప్రమాణాలు పెరగాలని ఐసీఎస్ఎస్ఆర్ దక్షిణ ప్రాంత సంచాలకులు ఆచార్య సుధాకరరెడ్డి పేర్కొన్నారు. ఐసీఎస్ఎస్ఆర్, కేబీఎన్ కళాశాల సంయుక్త నిర్వహణలో విద్యారంగంలో ఆధునిక పరిశోధన విధానాలపై యువ పరిశోధకులకు ఏడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుధాకరరెడ్డి మాట్లాడుతూ అధునాతన పరిశోధనల్లో డేటా అనలిటిక్స్ ప్రధాన భూమిక పోషిస్తోందన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న కన్సల్టెంట్ అకడమిక్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ ఆచార్య క్లో జాకబ్ మాట్లాడుతూ నూతన జాతీయ విద్యావిధానం 2020 పరిశోధనలకు పెద్దపీట వేసిందన్నారు. విద్యాబోధన, పరిశోధన రంగాల్లో విస్తృతమైన అవకాశాలు ఉన్నాయన్నారు. విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడం పరిశోధన ద్వారా మాత్రమే సాధ్యమవుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కృష్ణవేణి మాట్లాడుతూ అధ్యాపకులు నిరంతర పరిశోధకులుగా మారాలన్నారు. వివిధ విశ్వవిద్యాలయాల నుంచి రిసోర్స్‌పర్సన్స్‌గా పాల్గొన్న ఆచార్యులు పరిశోధనాంశాల రూపకల్పన, డేటా సేకరణ పద్ధతులు ఉపయోగించి గణిత విశ్లేషణ, సాహిత్య చౌర్య నివారణ, గుణాత్మక పరిశోధన పద్ధతులు, నివేదిక రచన, పరిశోధనా పత్రాల ప్రచురణ అంశాలపై పరిశోధకులకు శిక్షణ ఇచ్చారు. హిందూ హైస్కూల్స్ కమిటీ ఏట డాక్టర్ వి. నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ పీఎల్ రమేష్, డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, వర్క్‌షాప్ కన్వీనర్ కె. శివప్రకాష్, కామర్స్ విభాగాధిపతి హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతోపాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసి పోయాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడితోటల్లో సేద తీరారు. పెద్దసంఖ్యలో వాహనాలు రావడంతో పెనుగంచిప్రోలులో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి.

సాహిత్యంతో సామాజిక వికాసం

పటమట(విజయవాడపశ్చిమ): సాహిత్యంతో సామాజిక వికాసం సాధ్యమని ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, సుజనాచౌదరి అన్నారు. ఉషా మాసపత్రిక– సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నవలల పోటీల విజేతలకు కేబీఎన్ కళాశాల ప్రాంగణంలోని సెమినార్ హాల్‌లో ఆదివారం బహుమతులు అందజేశారు. విజేతలైన రచయితలకు సుజనాచౌదరి, మండలి బుద్ధ ప్రసాద్ బహుమతులు అందజేశారు. రచయితలు సింహప్రసాద్ (ఊరేగింపు), ఏనుగంటి వేణుగోపాల్ (ఆముక్త మాల్యద), సలీమ్ (ఊరు లేనోళ్లు), చంద్రశేఖర్ ఆజాద్ (అవతార్) తదితరులకు రూ.50 వేల చొప్పున నగదు బహుమతులను అందించారు. కార్యక్రమానికి మాసపత్రిక చీఫ్ ఎడిటర్ శరత్‌చంద్ర అధ్యక్షత వహించగా, బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి పాతూరి నాగభూషణం తదితరులు ప్రసంగించారు. పత్రిక బాధ్యులు కట్టా రాంబాబు, ఆర్‌డీ విల్సన్, కళాశాల ఏఓ డాక్టర్ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

యువశక్తికి, నవశక్తికి సంకేతం భగత్‌సింగ్



కొండపల్లిలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): యువశక్తికి, నవశక్తికి సంకేతంగా విప్లవ వీరుడు భగత్‌సింగ్ నిలుస్తారని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న అన్నారు. కొండపల్లి క్రాంతి హైస్కూల్‌లో సర్దార్ భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమం ఆదివారం జరిగింది. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ స్ఫూర్తితో నేటి యువతరం సమాజ శ్రేయస్సుకు పాటుపడాలన్నారు. కొందరు సంఘ విద్రోహులు భగత్‌సింగ్ స్ఫూర్తిని తక్కువ చేసి చూపడం సరైంది కాదని చెప్పారు. విద్యార్థులు దేశభక్తి భావాలతో నృత్య ప్రదర్శన చేసి ఆకట్టుకున్నారు. భగత్ సింగ్ ఆశయాలతో ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ప్రముఖ కవి అనిల్‌డేని, కళా దర్శకుడు శాంతారావు, పాఠశాల కరస్పాండెంట్ అమ్మాజీ, జోనీకుమారి, జాషువా సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు నారాయణరావు పాల్గొన్నారు.

తిరువూరు: దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి ఉరికంబం ఎక్కిన అమర వీరులు భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురులకు తిరువూరు ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో ఆదివారం నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి పద్మావతి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో విప్లవ వీరులకు నివాళులర్పించారు. బ్రిటిష్ పాలకులకు ఎదురొడ్డ పోరాడిన అమరవీరులను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రతినిధి హరికృష్ణ, విద్యార్థి సంఘ నాయకులు వెంకటేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పేర్కొన్నారు. స్థానిక సుంకరవీరభద్రరావు భవన్‌లో అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

ముసునూరు: దేశం కోసం ప్రాణాలను తృణప్రాయంగా త్యజించిన భగత్‌సింగ్ ధైర్యసాహసాలు నిజమైన దేశభక్తికి నిదర్శనమని సీపీఎం మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాస్ అన్నారు. ముసునూరులో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెంకట రమణమ్మ, జమలమ్మ, వెంకన్న, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి: చిన్నంపేటలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం, సామాజిక చైతన్య వేదిక కన్వీనర్ ఈవీ శ్రీనివాసరావు, సిద్దార్థ హైస్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తదితరుల పాల్గొన్నారు.

విస్సన్నపేట: స్థానిక సుందరయ్య భవనంలో భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమాన్ని సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ భగత్‌సింగ్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మేకల జ్ఞానరత్నం, సీఐటీయూ నాయకుడు ఆకుల శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: స్థానిక సీపీఎం కార్యాలయంలో భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్ గురు వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సత్తు కోటేశ్వరరావు, నైనవరపు ఉల్లక్కయ, జహంగీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.



తిరువూరు శాఖా గ్రంథాలయంలో విప్లవ వీరులకు నివాళి



చిన్నంపేటలో నివాళులర్పిస్తున్న ఆనందం తదితరులు

ముస్లిం వ్యతిరేక విధానాలను అడ్డుకుంటాం

హయాత్‌షరీఫ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): హజ్ యాత్రికులకు లక్ష రూపాయల ఆర్థిక సాయం అందిస్తామన్న చంద్రబాబు కూటమి ప్రభుత్వం, దాన్ని ఎగవేసేందుకు కుట్ర పన్నిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు హయాత్ షరీఫ్ విమర్శించారు. అందులో భాగంగానే విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్‌ను కేంద్రం ద్వారా రద్దు చేయించిందన్నారు. విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లోని తాజ్ మసీదు వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన ముస్లిం మైనార్టీల సమావేశంలో ఆయన మాట్లాడారు. పొరుగు రాష్ట్రాల్లో ఏపీకి చెందిన హాజీలు అవస్థలు పడకూడదనే అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టుదలతో విజయవాడలో ఎంబార్కేషన్ పాయింట్ తీసుకువచ్చారని గుర్తుచేశారు. అలాంటి సౌలభ్యాన్ని సీఎం చంద్రబాబు ఏపీ హజ్ కమిటీ చేత కేంద్రానికి లేఖ రాయించి రద్దు చేయించడం ద్వారా ముస్లిం మైనార్టీల ద్రోహిగా నిలిచారంటూ మండిపడ్డారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ముస్లింల ప్రయోజనాలను కాపాడటంలో ఘోరంగా విఫలమైందన్నారు. వక్ఫ్ సవరణ బిల్లును మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వ్యతిరేకించగా, చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మద్దతు తెలిపి ముస్లిం సమాజాన్ని మోసం చేసిందన్నారు. గత ప్రభుత్వం ముస్లింలకు అందించిన ఎంబార్కేషన్ సదుపాయాన్ని కేంద్రం తొలగిస్తుంటే సీఎం చంద్రబాబు పట్టనట్లు వ్యవహరించడం దారుణమన్నారు. ఏపీ నుంచి విమానయాన శాఖ మంత్రిగా రామ్మోహన్ నాయుడు ఉన్నప్పటికీ చోద్యం చూస్తుండటం బాధాకరమన్నారు. రాష్ట్రప్రభుత్వం అవలంభిస్తున్న ఇటువంటి ముస్లిం వ్యతిరేక విధానాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్‌కే నజీర్, ఎస్‌కే ఇర్ఫాన్, రాంజానీ, సయ్యద్ కాశీం తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్‌కు గాయాలు

మైలవరం: మైలవరం మండలం వెల్వడం గ్రామంలో నీటిని తీసుకువెళుతున్న వాటర్ ట్యాంకర్ ఆదివారం అదుపుతప్పి బోల్తా పడింది. వెల్వడం గ్రామంలో కొత్తగా వేసిన రోడ్లపై దుమ్ము లేవకుండా నీళ్లు చల్లడానికి ఏర్పాటు చేసిన ట్రాక్టర్ సమీపంలోని గుంటను తప్పించబోయి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో మైలవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసులు ట్రాక్టర్‌ను పక్కకు తొలగించారు.

పేదలకు రంజాన్ తోఫా పంపిణీ

వించిపేట(విజయవాడపశ్చిమ): పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని రాష్ట్ర స్వర్ణకారుల సంఘం ఉపాధ్యక్షుడు షేక్ అమానుల్లా ఆధ్వర్యంలో ఆదివారం వించిపేట, నైజాంగేటు సెంటర్‌లో పేదలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమానుల్లా మాట్లాడుతూ రంజాన్ మాసం అంటే దాన ధర్మాల మాసం అని పేర్కొన్నారు. ఎంత దానం చేస్తే అంతకు రెట్టింపు పుణ్యం లభిస్తుందని చెప్పారు. ప్రతి ముస్లిం ఉపవాస దీక్ష చేస్తూ నిజమైన పేదలను గుర్తించి వారికి దానధర్మాలు చేయాలని సూచించారు. రంజాన్ ప్రారంభం నుంచి ఏటా తన శక్తికొలది సహాయం చేస్తున్నామన్నారు. ఈ ఏడాది కూడా 300 మంది పేదలకు రంజాన్ తోఫాను అందజేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు.